క్లుప్తంగా

12న విగ్రహ ప్రతిష్ఠ

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ కేంద్రంలో ఈ నెల 12న శ్రీరాములు వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ చింతర్ల సునీల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో 14వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తీర్థ మహోత్సవాలు జరగనున్నట్టు సునీల్ తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐకెఎంఎస్ నాయకుడు పల్లాల లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. జీడిపిక్కలు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గిట్టుబాటు ధర కోసం దశాబ్దాలుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించిన ఎస్ఐ కిషోర్‌వర్మ

కొయ్యూరు: యువత క్రీడలపై దృష్టి సారిస్తే దేశానికి, సొంత గ్రామానికి మంచి పేరు తీసుకురావచ్చని కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ అన్నారు. బాలారంలో మాజీ సర్పంచ్ అప్పన శ్రీరాములు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని ఎస్ఐ కిషోర్ వర్మ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నీని నిర్వహిస్తున్న అప్పన ఆనంద్ కుమార్, లక్ష్మీరాజ్‌లను అభినందించారు. ఎస్ఐ కిషోర్ వర్మ కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. తొలిరోజు కృష్ణాదేవిపేట–చోద్యం టీమ్‌ల మధ్య జరిగిన పోటీలో కృష్ణాదేవిపేట విజయం సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు.

అధ్వాన కల్వర్టుతో అవస్థలు


రాళ్లు తేలి ఉన్న కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ కేంద్రం వద్ద ఉన్న కల్వర్టు గతేడాది వర్షాలకు పాడై, అధ్వానంగా మారింది. రాళ్లు తెలిపోయి, వాహనాలు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తుండడంతో గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం బరడ నుంచి హంసబంధ మార్గం మీదగా వచ్చే వాహనచోదకులు బరడ గ్రామంలోని కల్వర్టు పరిస్థితిని చూసి భయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. గతంలో నిర్మించిన కల్వర్టుపై భాగం పూర్తిగా పాడైపోవడంతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందిగా ఉందని, తక్షణమే అధికారులు స్పందించి, నిధులు మంజూరు చేసి కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లి అమ్మవారు

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అధిక సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గోవిందపాలెంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ


సీతారామ స్వామి విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం గోవిందపాలెంలోని శ్రీసీతారామ స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ముందుగా విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

తీరని వెతలు


రెండు శాఖల కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవిత కేంద్రం

- ఒకే భవనం...రెండు కార్యాలయాలు
- వసతి లేమితో ఇబ్బందులు
- పాత భవనం శిథిలం... భవిత భవనంలోనే విద్యా శాఖ విధులు


శిథిలమైన విద్యాశాఖ భవనం

చింతపల్లి: మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న ఒకే భవనంలోనే రెండు కార్యాలయాలు విధుల నిర్వాహణతో సిబ్బంది వసతి లేమితో ఇబ్బందులు పడుతున్నారు. విద్యాశాఖకు సంబంధించి నేటి వరకూ పూర్తిస్థాయి భవనం లేక ఆ శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలం మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న భవనంలో విధులు నిర్వహించేవారు. ఆ భవనం పూర్తిగా పై కప్పు శిథిలం కావడంతో చిన్న చినుకు పడినా కారిపోవడంతో పాటు పై నుంచి పెచ్చులు రాలిపడడంతో విధులు నిర్వాహణకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కార్యాలయంలో ఉన్నటువంటి స్టేషనరీతో పాటు మిగిలిన రికార్డులకు భద్రపరచడానికి ఇబ్బందులు పడేవారు.దీంతో ఇదే ప్రాంగణంలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వనరులు కేంద్రం (భవిత) భవనంలోనికి విద్యాశాఖ కార్యాలయాన్ని మార్పు చేశారు.అప్పటికే మండలంలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఈ కేంద్రం ద్వారా సేవలందిస్తున్నారు. ఈ భవనం సైతం ఒక హాలు రెండు చిన్న గదులతో ఉంది.దీనిలో పిల్లలకు ఒక ఫిజియోథెరపిస్టు ,ఇద్దరు ఐఆర్‌టీలు,ఒక ఆఫీసు బాయ్ విధులు నిర్వహిస్తున్నారు. అదే భవనంలో విద్యాశాఖ కార్యక్రమాలు కూడా చేపట్టడంతో వసతి సమస్య ఏర్పడుతుంది. చూడడానికి రెండు కార్యాలయాలు ఒకే శాఖకు సంబంధించినవి అయినప్పటికీ విధుల నిర్వాహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒక గదిలో ప్రతి రోజు ఐఆర్‌టీలు సేవలందిస్తున్నారు.

విద్యాశాఖకు ప్రత్యేక భవనం అవసరం

మండలంలో విద్యాశాఖకు ప్రత్యేక భవనం అవసరం ఎంతైనా ఉంది. మండలంలో 208 పాఠశాలల్లో 15,700 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.పాఠశాలలను ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ఈ కార్యాలయంలో ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఎంఐఎస్, ఆఫీస్‌బాయ్‌తో పాటు 7 క్లస్టర్‌లు సంబంధించిన సీఆర్పీలు విధులు నిర్వహిస్తున్నారు. విద్యా సంస్థకు సంబంధించి ఏ చిన్న అవసరానికైనా విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కార్యాలయానికి వస్తుంటారు. వసతి సమస్యతో వారు సతమతమవుతున్నారు. సొంత భవనం లేకపోయినా సంబంధిత శాఖాధికారులు నూతన భవన నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరం. ఇప్పటికైనా కార్యాలయ ప్రాంగణంలో శిథిల స్థితిలో ఉన్న భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



మండల పరిషత్ ప్రాంగణంలో శిథిల స్థితిలో ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించి అదే ప్రదేశంలో నూతన భవన నిర్మాణానికి ఉన్నతాదికారులకు ప్రతిపాదనలు పంపించాం .నిధులు విడుదలైన వెంటనే భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తాం.

– శ్రీనివాసరావు, ఎంపీడీవో, చింతపల్లి

బాలిక ఆత్మహత్యపై విచారణ చేయాలి

రంపచోడవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున గిరిజన బాలిక ఆత్మహత్య చేసుకునే పరిస్థితులకు దారి తీయడం విచారకరమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పండా రామకృష్ణదొర అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన అందజేశారు. రంపచోడవరం మండలం వాడపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని అశ్విని పాఠశాల తరగతి గదిలోనే ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆరోపించారు. వాడపల్లి పాఠశాలలో సీసీ కెమెరాలు ఉన్న పనిచేయకపోవడం, వాటి గురించి పట్టించుకోకపోవడం ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న బాలిక మృతి ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఏజెన్సీలో గిరిజన బాలికల పట్ల అనేక సంఘటనలు జరుగుతున్నా ఐటీడీఏ యంత్రాంగం విస్మరించడం దారుణమన్నారు. మహిళలపై రోజు రోజుకి అఘాయిత్యాలు పెరిగిపోతున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏజెన్సీలో బాలికలకు ఏ సమస్య వచ్చినా వైఎస్సార్‌సీపీ వారి తరఫున పోరాటం చేస్తుందన్నారు. బాలిక మృతిపై హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఆశ్రమ పాఠశాల్లో వార్డెన్, హెచ్‌ఎంలు విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ఔదార్యం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం


బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని మడిచర్ల గ్రామానికి చెందిన కలిమెల అప్పారావు ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. పార్టీ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ ఆర్థిక సహాయాన్ని, బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి వెంట ఎంపీపీ బందం శ్రీదేవి, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, పార్టీ నాయకులు బొబ్బా శేఖర్, కారుకోడి పూజ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసేందుకు ఆసక్తిగా పనిచేయాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని, పార్టీలో నమ్మకంగా పనిచేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. వైస్ ఎంపీపీ ప్రియాంక, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసాద్, అరకు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు రేగం శివరామ్, ఎంపీటీసీలు భీమలింగేశ్వరరావు, సుశీల, కొండమ్మ, సర్పంచ్‌లు సాంబ, బొంజుబాబు, రమేష్, వెంకట్, మేరి, పూర్ణిమ, కిలగడ సింహాచలం పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇళ్లు దగ్ధం


వై.రామవరంలో మంటలను అదుపుచేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది


లాగరాయిలో బాధితునికి సాయమందిస్తున్న సర్పంచ్ గణలక్ష్మి

వై.రామవరం: వై.రామవరం గ్రామంలోని సంతపాకలువద్ద ఆదివారం మధ్యాహ్నం పూరోడి అంజి అనే గిరిజనుడికి చెందిన పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమై కాలి బూడిదైంది. బాధిత కుటుంబం సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.1.50లక్షల వరకు నష్టం జరిగినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఒక్కసారిగా మంటలు చేలరేగడం గమనించి, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ డీఎస్పీ రాధ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించి మంటలను అదుపుచేశారు.

రాజవొమ్మంగి: లాగరాయి గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో టైలర్ వృత్తి చేస్తు జీవిస్తున్న షేక్ దాదా తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఒక్కసారిగా ఎగసిన మంటలకు ఇంట్లో కుట్టుమిషన్‌తో పాటు సామగ్రి కాలిబూడిదైనట్టు స్థానికులు తెలిపారు. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినా ఫలించలేదు. ప్రమాదంలో సుమారు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానికులు అంచనా. ఈ ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని సర్పంచ్ మిరియాల గణలక్ష్మి పరామర్శించి ఆర్థిక సహాయం, నిత్యావసర సరకులు అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు భీమలింగేశ్వర స్వామి జాతర

పెదబయలు: మండలంలోని సీతగుంటలో భీమలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రూడ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ జాతర ఉత్సవాలకు పెదబయలు, ముంచంగిపుట్టు, పాడేరు, హుకుంపేట మండలాలతో పాటుగా ఒడిశా భక్తులు అధికంగా వస్తారని తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అరకులోయ టౌన్: మండల కేంద్రంలోని గురుకులం బాలుర బాలికల పాఠశాలలో ఆదివారం ఎస్‌వోఈ, సీవోఈ(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) ప్రవేశ పరీక్షల ప్రశాతంగా జరిగింది. గురుకుల పాఠశాలలో 8వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటర్ పరీక్షకు 355 మంది హాజరుకావల్సి ఉండగా 331 మంది, 8వ తరగతిలో ప్రవేశానికి 152 మందికి 133 మంది విద్యార్థులు హాజరైనట్టు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద అరకు సీఐ ఎల్.హిమగిరి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలు


రోడ్ ప్రమాదంలో గాయపడిన అర్జున్‌ను 108లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగికి చెందిన అయితిరెడ్డి అర్జున్ (65) ఆదివారం రాజవొమ్మంగి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అర్జున్ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్తూ జాతీయ రహదారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అదే సమయంలో వట్టిగెడ్డ నుంచి రాజవొమ్మంగి వస్తున్న కారు అతనిని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అర్జున్ ఎడమ కాలు నుజ్జు నుజ్జు కావడంతో సంఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయాడు. స్థానికులు హుటాహుటిన 108లో అతనిని స్థానిక పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అర్జున్‌ను కాకినాడ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. కాలు పూర్తిగా విరిగిపోయి ఎముకలు బయటకు రావడంతో అర్జున్‌కు తీవ్ర రక్త స్రావమైనట్టు వైద్యులు తెలిపారు. నిరుపేద రైతు అయిన అర్జున్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెప్పారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ


హుషారుగా దౌడు తీస్తున్న ఎడ్లు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులంతా గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం ఆకట్టుకుంది. విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. రాత్రికి భారీ మందుగుండు సామగ్రి కాల్పులు, డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి సంబరం సాగింది. మంగళాపురం, కుముదాంపేట, సురవరం, వడ్డాది తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్


చింతలవీధిలో గిరిజనులతో మాట్లాడుతున్న అప్పలనర్స

పాడేరు రూరల్: అర్హులైన ప్రతి పేద గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స తెలిపారు. పార్టీ ప్రజా చైతన్య అధ్యయన యాత్రను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా చింతలవీధి పంచాయతీ పరిధిలో వివిధ గ్రామాల్లో పర్యటించారు. గిరిజనులతో సమావేశం నిర్వహించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 8 నుంచి 28వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు స్వీకరిస్తున్నామన్నారు. ప్రతి పేద గిరిజనుడికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని, అవసరమైన కుటుంబాలకు స్థలం కేటాయించాలన్నారు. ఇళ్ల యూనిట్ రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. తక్షణమే ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సుందరరావు, దాసు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి


కులుపాడులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జి.మాడుగుల: సమాజంలో మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని, అందరిలో చైతన్యం రావాలని, ధైర్యసాహసాలు ఉండాలని హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మూఢ నమ్మకాలు నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లో రాంబాబు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్ తెలిపారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ కులపాడు గ్రామంలో మూఢనమ్మకాలు నిర్మూలన సంఘం అధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ఆదివారం వారు సమావేశం నిర్వహించారు, వారు మాట్లాడుతూ మూఢనమ్మకాలు నమ్మవద్దని, వాటి వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయని, మహిళలు చైతన్యంతో ఉండాలని తనతో పాటు తన కుటుంబాన్ని చైతన్యంగా మలచటానికి దోహదపడుతుందన్నారు.మూఢ నమ్మకాలు నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులైన ప్రతీ ఒక్కరు వీటిపై అవగాహనతో ఉండాలన్నారు. మహనీయులు చిత్రపటాలు, పుస్తకాలను వారు పంపిణీ చేశారు. మూఢనమ్మకాలు నిర్మూలన సంఘం ప్రతినిధులు ధర్మారావు, శ్రీహరి, గిరి, వసంత, ఝాన్సీరాణి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జీపుల పండుగ


ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

జి.మాడుగుల: పాడేరు, జి.మాడుగుల రూట్ శ్రీమోద వినాయక సాయి మోటార్ యూనియన్, వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో జీపుల పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా నుర్మతి జంక్షన్ వద్ద మోదకొండమ్మ ఆమ్మవారికి ఘటాలను ప్రతిష్ఠించి వేద పండితుల మంత్రోచ్చరణలతో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు దొడ్డి సత్తిబాబు (సత్తిబాబు), అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు పెంటారావు, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో ఘటాలను ఊరేగింపుగా పాడేరు మోదకొండమ్మ తల్లి పాదాలు సన్నిధికి తరలించారు. అమ్మవారికి డ్రైవర్లు, ఓనర్లు మొక్కులు చెల్లించుకొన్నారు. యూనియన్ నాయకులు అచ్యుతరావు, రామకృష్ణ, రాము, సత్తిబాబు, అప్పారావు, డాన్ శ్రీను, ప్రసాద్, కాటా మహేష్, దిబ్బిడి శ్రీను తదితరలు పాల్గొన్నారు.

జోరుగా చిరుధాన్యాల కొనుగోళ్లు

- మిల్లెట్స్ హబ్‌లో నిల్వలు
- గిట్టుబాటు ధరలు


డుంబ్రిగుడలో మిల్లెట్స్ హబ్

డుంబ్రిగుడ: ఐటీడీఏ ఆధ్వర్యంలో వన్‌ధన్ వికాస్ కేంద్రం మిల్లెట్స్ హబ్‌ని రైతు ఉత్పతిదారుల సంఘం ద్వారా మండల కేంద్రంలో ఏర్పాటుచేశారు ఉద్యానవనశాఖ సుమారు రూ.11.25 లక్షలతో ఈ కేంద్రాన్ని నిర్మించింది. రైతులు పండించిన చిరుధాన్యాలను ఈ కేంద్రంలో విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రంలో ఉన్న కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 7,250 కిలోల సామలను, 937 కిలోల ధాన్యాన్ని కొనుగోలు చేసి వాటిని మిల్లు ఆడించి ఎగుమతి చేసేందుకు సిద్ధం చేశారు. కిలో సామలు రూ.33లతో సుమారు రూ.2.40లక్షలకు కొనుగోలు చేశారు. అలాగే ధాన్యం 937 కిలోలు ఒక్కో కిలో రూ.16లతో సుమారు రూ.15వేలకు కొనుగోలు చేసి గొడౌన్‌లో నిల్వ ఉంచారు. ప్రస్తుతం ఐటీడీఏ ఏర్పాటు చేసే ధాన్యం మిల్లుల ద్వారా వాటిని ఆడించి బయట మార్కెట్‌లో విక్రయిస్తారు. రైతుల వద్ద కొన్న ధరల కంటే మార్కెట్‌లో అధిక ధరలు విక్రయించగా వచ్చే లాభాలను గిరిజన రైతులకు బోనస్ ద్వారా అందజేస్తామని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. రైతులకు సరకులు భద్రపరచుకునేందుకు క్రేట్‌ను ఒక రూపాయికి అద్దెకు ఇస్తున్నారు. మండలంలోని నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం డుంబ్రిగుడ మండల కేంద్రంలో ఉన్న కొనుగోలు కేంద్రంలో మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి.. కొర్రాయి పంచాయతీ కేంద్రం, జాముగుడలో, అరకు సంతబయలుల ఉన్న మిగిలిన మూడు కొనుగోలు కేంద్రంలో ఎటువంటి క్రయ, విక్రయాలు జరగడం లేదు. ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఎంతో మేలు జరుగుతుందని గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వ్యవసాయ శాఖ కూడా మేలు రకమైన రాగుల్లను కొనుగోలు చేసి సివిల్ సప్లయికు తరలిస్తున్నారు.

ముంచెత్తిన మంచు


డుంబ్రిగుడలో కురుస్తున్న మంచు


లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

డుంబ్రిగుడ: మండలంలోని ఆదివారం ఉదయం అధిక పోగమంచు కురవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హెడ్‌లైట్‌లతో బస్సులు ప్రయాణించాయి. మంచు ప్రభావం ఎక్కువ కావడంతో మామిడి పూత, జీడి మామిడి పూతరాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉండడంతో గిరిజనులు ఉదయం పూట చలిమంట కాస్తు ఉపశమనం పొందుతున్నారు. అయితే మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.